# వాక్యము

క్రీస్తు వ్యక్తిత్వ
శాస్త్రముపై
లిగోనియర్ వ్యాఖ్య

# శరీరధారి

# ఆయెను

# వాక్యము శరీరధారి ఆయెను

క్రీస్తు వ్యక్తిత్వ
శాస్త్రముపై
లిగోనియర్ వ్యాఖ్య

Ligonier Ministries

The Word Made Flesh: The Ligonier Statement on Christology
Copyright © 2022 by Ligonier Ministries
Second edition
Published by Ligonier Ministries
421 Ligonier Court, Sanford, FL 32771
Ligonier.org | ChristologyStatement.com
Scripture quotations are from the Telugu OV Bible, Bible Society of India.

యేసు క్రీస్తు ఎవరు? యుక్తవయస్సుకు వచ్చిన దాదాపు ప్రతి ఒక్కరు యేసుమీద ఒక అభిప్రాయం ఏర్పరచుకొని ఉన్నారు. ఈ అభిప్రాయాలు లోతుగా లేనటువంటివి, అవగాహన లేనటువంటివి లేదా స్పష్టమైన వితండవాదనలు కావచ్చు. యేసును గూర్చిన సత్యము కేవలం అభిప్రాయాలు కావు, విషయాలు...శాశ్వతంగా ప్రాధాన్యత కలిగిన విషయాలు.

క్రైస్తవులమని విశ్వసించువారు క్రీస్తును వెంబడించు శిష్యులై యున్నారు. క్రీస్తును గురించి వారికున్న అభిప్రాయాన్ని ప్రతిబింబించే ఒక క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమును—క్రీస్తును గురించిన ఒక సిద్ధాంతమును—వారు కలిగి యున్నారు. ఈ క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమును అస్పష్టంగా కాని, స్పష్టంగా గాని వెల్లడించవచ్చు. అది లేఖనములలోనున్న లోతైన బైబిలు దివ్య వార్తను మరియు చారిత్రాత్మకమైన క్రైస్తవత్వమును సూచించవచ్చు, లేదా ఒక క్రొత్త కథ మరియు దేవుని వాక్యమునకు సంబంధించనిది కావచ్చు. కాని విశ్వసించు ప్రతి క్రైస్తవుడు ఒక క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమును లేకుండ ఉండడు.

క్రీస్తును వెంబడించుట క్రైస్తవత్వానికి మూలం కాబట్టి, మన ఊహలలో ఉన్న క్రీస్తును కాకుండ లేఖనములలోనూ, చరిత్రలోను ఉన్న క్రీస్తును ప్రకటించుటకు సంఘము శతాబ్దాలుగా కృషి చేసింది. నైసీన్ క్రీడ్ (క్రైస్తవ మత విశ్వాస సంపుటి), చాల్సిడన్ నిర్వచనం, హైడల్బర్గ్ కేటిచిజం (ప్రశ్నోత్తర గ్రంథం) మరియు వెస్ట్ మిన్స్టర్ కన్ఫెషన్ లాంటి చారిత్రకమైన ప్రకటనలలో క్రీస్తు మీద బైబిలు బోధనను క్రైస్తవులు వెల్లడించారు.

ఈ దినాలలో ఈ వాఙ్మ్మలాలు తరచుగా నిర్లక్ష్యం చేయబడ్డాయి మరియు అపార్థం చేసుకొనబడ్డాయి. దానివలన, క్రీస్తు యొక్క వ్యక్తిత్వము, ఆయన చేసిన కార్యము మీద చాలా గందరగోళం ఏర్పడింది. చారిత్రాత్మిక, సాంప్రదాయసిద్ధమైన, వాక్యానుసారమైన క్రైస్తవ సంఘము ఒప్పుకొనుటకు సులభముగా నుండునట్లు క్రీస్తు మహిమార్థమై మరియు ఆయన ప్రజల యొక్క ఆధ్యాత్మిక క్షేమాభివృద్ధి కొరకై ఈ క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రముపై లిగోనియర్ వ్యాఖ్య టూకీగా చెప్పుటకు సహాయపడుచున్నది. సంఘము తన విశ్వాసమును కొనసాగించుటకు, విశ్వాసులందరికీ వర్తించే ఒప్పుదలకు ఉపయోగకరంగా ఉండు బోధనిచ్చుచూ, ఆయా సంఘ విశ్వాసులందరూ ధైర్యముగా కలిసికొని సంఘ లక్ష్యమును కొనసాగించుటకు ఈ వ్యాఖ్య సహాయకరముగా నుండును. సంఘము యొక్క చారిత్రాత్మిక మత సిద్ధాంతములకు మరియు ఒప్పుదలలకు బదులుగా ఈ వ్యాఖ్య కాదు. కాని క్రీస్తు ఎవరు, ఆయన ఏ కార్యము చేశారు అను విషయాలపై వారి సామూహిక బోధనలను స్పష్టంగా భావ వ్యక్తీకరణ చేయుటకు అదనంగా చేర్చబడింది. తన రాజ్యము కొరకు క్రీస్తు దానిని వాడుకొనును గాక.

శరీరధారియైన దేవుని కుమారుడు, మన ప్రవక్త, యాజకుడు మరియు రాజు నామమున,

ఆర్. సి. స్ప్రౌల్
స్ప్రింగ్ 2016

దేవుడు శరీరధారియగుట యందున్న అద్భుతమును
  మరియు మర్మమును మేము ఒప్పుకొనుచున్నాము
  మరియు మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా కలిగిన
  గొప్ప రక్షణ యందు సంతోషిస్తున్నాము.

తండ్రి మరియు పరిశుద్ధాత్మతో కలిసి
  కుమారుడు సమస్తమును సృజించెను,
  సమస్తమును భరించుచున్నాడు,
  మరియు సమస్తమును నూతన పరచును.
  నిజముగా దేవుడు,
  ఆయన నిజముగా మనుష్యుడాయెను,
  ఒకే వ్యక్తిలో రెండు స్వభావములు.

ఆయన కన్య మరియకు జన్మించి
  మన మధ్యలో నివసించెను.
  సిలువ వేయబడి, మరణించి,
  మరియు సమాధి చేయబడి,
  మూడవ దినమున ఆయన లేచి,
  పరలోకమునకు ఆరోహణుడై,
  మరియు మహిమలో తీర్పు తీర్చుటకు
  తిరిగి వచ్చును.

మన కొరకు,
  ఆయన ధర్మశాస్త్రమును పాటించెను,
  పాపమునకు పరిహారమాయెను,
  మరియు దేవుని ఉగ్రతను సమాధానపరచెను.
  ఆయన మన మురికి బట్టలను తీసివేసి
  తన నీతి వస్త్రములను మనకిచ్చెను.

ఆయన మన ప్రవక్త, యాజకుడు మరియు రాజు,
  ఆయన తన సంఘమును కట్టుచున్నాడు,
  మనకొరకు విజ్ఞాపన చేయుచున్నాడు,
  మరియు సమస్తమును పరిపాలించు చున్నాడు.

యేసు క్రీస్తు ప్రభువై యున్నాడు;
  ఆయన పరిశుద్ధ నామమును సదా స్తుతించుదము.

ఆమెన్.

# ధృవీకరణలు మరియు నిరాకరణలు

లేఖనముల
ఆధారముతో

*నిబంధన 1*

నిత్యమైన దేవుని కుమారుని చరిత్రలో యేసు శరీరధారియాయెనని, పరిశుద్ధ త్రిత్వములో రెండవ వ్యక్తి అని, ఆయన క్రీస్తు, దేవుడు వాగ్దానము చేసిన మెస్సీయ అని మేము ధృవీకరిస్తున్నాము.[1]

యేసు కేవలము మానవుడు లేదా ఆది క్రైస్తవ సంఘము సృష్టించిన కల్పితమనే ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 2*

దైవత్వములోని సమైక్యతలో నిత్యుడైన అద్వితీయ కుమారుడు సమప్రాధాన్యత కలవాడని *(homoiousios)*, సమ ఉజ్జీయని, తండ్రి మరియు పరిశుద్ధాత్మతో సమ నిత్యుడని మేము ధృవీకరిస్తున్నాము.[2]

కుమారుడు కేవలం దేవుని వంటివాడు *(homoiousios)* లేదా దేవుడు కేవలం ఆయనను దత్తపుత్రునిగా స్వీకరించెనను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము. దేవుడు మహా శక్తిమంతుడని నిర్వచించాలన్న వాదంగల త్రిత్వంలో తండ్రికంటె కుమారుడు నిత్యముగా తక్కువ స్థాయి గలవాడను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 3*

యేసు క్రీస్తు నిజముగా దేవుడు మరియు నిజముగా మానవుడు, ఈ రెండు స్వభావములు ఒక వ్యక్తిలో నిత్యముగా ఏకమైయున్నాయని చెప్పే నైసీన్ మరియు చాల్సిడోనియన్ విశ్వాస తీర్మానములను మేము ధృవీకరిస్తున్నాము.[3]

కుమారుడు సృష్టింపబడెనన్న ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము. ఎప్పుడైనా, ఏ సమయములోనైనా కుమారుడు దైవత్వము కలిగి యుండలేదనుటను మేము నిరాకరిస్తున్నాము. చరిత్రలో కుమారుడు శరీరధారి కాకముందు యేసు క్రీస్తు మానవ శరీరమును, ఆత్మను కలిగియున్నాడను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

---

[1] ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను....ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:1, 14). వీటిని కూడ చూడుడి: కీర్తన 110:1; మత్తయి 3:17; 8:29; 16:16; మార్కు 1:1, 11; 15:39; లూకా 22:70; యోహాను 4:25–26; అపొ.కా. 5:42; 9:22; గలతీ. 4:4; ఫిలిప్పీ. 2:6; కొలొస్సీ. 2:9; హెబ్రీ. 5:7; 1 యోహాను 5:20.

[2] కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మియ్యుడి (మత్తయి 28:19). వీటిని కూడ చూడుడి: యోహాను 1:18; 3:16–18; 10:30; 20:28; 2 కొరింథీ. 13:14; ఎఫెసీ. 2:18.

[3] ఏలయనగా దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించు చున్నది (కొలొస్సీ. 2:9). వీటిని కూడ చూడుడి: లూకా 1:35; యోహాను 10:30; రోమీ. 9:5; 1 తిమోతి 3:16; 1 పేతురు 3:18.

*నిబంధన 4* ఎటువంటి మిశ్రితము, సందిగ్ధత, విభేదము లేదా భిన్నత్వము లేకుండ యేసు క్రీస్తు యొక్క రెండు స్వభావములు ఆయన ఒక్క వ్యక్తిత్వములో ఐక్యము చేయబడెనను ప్రధానమైన ఐక్యతను మేము ధృవీకరిస్తున్నాము.[4]

ఈ రెండు స్వభావములను వేరు వేరుగా ప్రత్యేకించుట అనగా ఈ రెండు స్వభావములను వేరు చేయుట అను వాదనను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 5* యేసు క్రీస్తు శరీరధారిగా ఉన్నప్పుడు, ఆయన దైవిక మరియు మానవ స్వభావములు రెండునూ వాటి గుణములలో మార్పు లేకుండ ఉండెనని మేము ధృవీకరిస్తున్నాము. ఈ రెండు స్వభావముల గుణములు యేసు క్రీస్తు అను ఒకే వ్యక్తికి చెందియున్నాయని ధృవీకరిస్తున్నాము.[5]

యేసు క్రీస్తు యొక్క మానవ శరీరము దైవిక గుణము లేక దైవిక స్వభావము కలిగి యున్నదను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము. మానవ శరీరమునకు, దైవిక స్వభావము దైవిక గుణములను అందించుననుటను మేము నిరాకరిస్తున్నాము. మానవ శరీరధారిగా ఉన్నప్పుడు కుమారుడు తన ఏ దైవిక గుణములైనా విడిచిపెట్టెనను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 6* యేసు క్రీస్తు అదృశ్యమైన దేవుని స్వరూపియై యున్నాడు, నిజమైన మానవత్వమునకు ఆయన ప్రమాణము, మరియు మనము విమోచించబడినప్పుడు ఆయన పోలికలోకి చివరిగా మార్చబడుదుము అని మేము ధృవీకరిస్తున్నాము.[6]

యేసు క్రీస్తు నిజమైన మానవునికంటె తక్కువ అని, కేవలము మానవునిగా కనబడ్డాడని, లేక హేతుబద్ధమైన మానవ ఆత్మను కలిగియుండలేదను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము. త్రియేక దేవుని ఐక్యతలో కుమారుడు మానవ స్వభావమును కాకుండ మానవ రూపాన్ని మాత్రమే ధరించెనను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

---

[4] అందుకు సీమోను పేతురు– నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు– సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేకాని నరులు నీకు బయలు పరచలేదని అతనితో చెప్పెను (మత్తయి 16:16–17). వీటిని కూడ చూడుడి: లూకా 1:35, 43; యోహాను 1:1–3; 8:58; 17:5; అపొ.కా. 20:28; రోమీ. 1:3; 9:5; 2 కొరింథీ. 8:9; కొలొస్సీ. 2:9; 1 తిమోతి 3:16; 1 పేతురు 3:18; ప్రకటన 1:8, 17; 22:13.

[5] క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను (ఫిలిప్పీ. 2:5–7). వీటిని కూడ చూడుడి: మత్తయి 9:10; 16:16; 19:28; యోహాను 1:1; 11:27, 35; 20:28; రోమీ. 1:3–4; 9:5; ఎఫెసీ. 1:20–22; కొలొస్సీ. 1:16–17; 2:9–10; 1 తిమోతి 3:16; హెబ్రీ. 1:3, 8–9; 1 పేతురు 3:18; 2 పేతురు 1:1.

[6] ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింప బడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను (కొలొస్సీ. 1:15–16). వీటిని కూడ చూడుడి: రోమీ. 8:29; 2 కొరింథీ. 4:4–6; ఎఫెసీ. 4:20–24; హెబ్రీ. 1:3–4.

*నిబంధన 7*

నిజమైన మానవునిగా, యేసు క్రీస్తు తన దీన స్థితిలో సహజమైన భౌతిక పరిమితులను మరియు మానవ స్వభావమునకు చెందిన సాధారణ బలహీనతలను కలిగియుండెనని మేము ధృవీకరిస్తున్నాము. అన్ని విషయములలో ఆయన మనవలే చేయబడెను, అయినను ఆయనయందు పాపమేమియు లేదని మేము ధృవీకరిస్తున్నాము.[7]

యేసు పాపము చేసెననుటను మేము నిరాకరిస్తున్నాము. శ్రమలను, శోధనలను మరియు కష్టములను యేసు నిజముగా అనుభవించలేదను ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము. ఆయన యదార్థమైన మానవత్వములో పాపము స్వతఃసిద్ధముగా ఉన్నదనుటను లేదా యేసుని పాపరాహిత్యము ఆయన నిజమైన మానవత్వమునకు విరుద్ధమైనదనే ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 8*

పరిశుద్ధాత్మ శక్తి ద్వారా, అద్భుత రీతిగా, కన్యయైన మరియ గర్భము ధరించి, చారిత్రాత్మకమైన యేసు క్రీస్తునకు జన్మనిచ్చుటను మేము ధృవీకరిస్తున్నాము. మరియ దేవుని తల్లి అని చెప్పుట సరియైనది ఏలయనగా తను జన్మనిచ్చిన బిడ్డ శరీరధారియైన దేవుని కుమారుడు, పరిశుద్ధ త్రిత్వములో రెండవ వ్యక్తి అనే చాల్సిడోనియన్ క్రీడ్‌తో అంగీకరించి మేము ధృవీకరిస్తున్నాము.[8]

యేసు తన దైవిక స్వభావాన్ని మరియ యొద్దనుండి పొందియున్నాడు లేదా ఆయన పాపరాహిత్యము ఆమె యొద్దనుండి కలిగినదనే ఆక్షేపణను మేము నిరాకరిస్తున్నాము.

---

[7] కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై, దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమునుగల ప్రధానయాజకుడగు నిమిత్తము, అన్నివిషయములలో ఆయన తన సహోదరుల వంటివాడు కావలసివచ్చెను. తాను శోధింపబడి శ్రమ పొందెను గనుక శోధింపబడువారికిని సహాయము చేయ గలవాడై యున్నాడు (హెబ్రీ. 2:17–18). వీటిని కూడ చూడుడి: మీకా 5:2; లూకా 2:52; రోమీ. 8:3; గలతీ. 4:4; ఫిలిప్పీ. 2:5–8; హెబ్రీ. 4:15.

[8] ఆరవ నెలలో గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యకయొద్దకు దేవుని చేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ (లూకా 1:26–27). వీటిని కూడ చూడుడి: మత్తయి 1:23; 2:11; లూకా 1:31, 35, 43; రోమీ. 1:3; గలతీ. 4:4.

*నిబంధన 9*

మొదటి ఆదాము అన్ని విషయములలో విఫలుడైనప్పటికీ, కడపటి ఆదామైన యేసు క్రీస్తు తనకు అప్పగింపబడిన ప్రతి పనిలో సఫలమగుటను మరియు యేసు క్రీస్తు తన ప్రజలు అనగా క్రీస్తు శరీరముపై శిరస్సై యున్నాడనుటను మేము ధృవీకరిస్తున్నాము.[9]

పడిపోయిన మానవ స్వభావమును యేసు కలిగియుండెననికాని ఆది పాపమును వారసత్వముగా పొందెననుటనుగాని మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 10*

ధర్మశాస్త్రము అవశ్యముగా కోరుచున్నదానిని యేసు క్రీస్తు తన పరిపూర్ణ జీవితంలో, క్రియాపూర్వకమైన మరియు నిష్క్రియాత్మకమైన విధేయతద్వారా మన తరపున నెరవేర్చెనని మరియు సిలువ మరణము ద్వారా ఆయన మన పాపములకు రావలసిన శిక్షను భరించెనని మేము ధృవీకరిస్తున్నాము.[10]

దేవుని ధర్మశాస్త్రమునకు విధేయత చూపుటలోగాని నెరవేర్చుటలోగాని ఏ సందర్భములోనైన యేసు క్రీస్తు విఫలుడైనాడనుటను మేము నిరాకరిస్తున్నాము. ఆయన నైతిక ధర్మశాస్త్రమును రద్దు చేసెననుటను మేము నిరాకరిస్తున్నాము.

---

[9] ఇట్లుండగా ఒక మనుష్యునిద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను. ఏలయనగా ధర్మశాస్త్రము వచ్చినదనుక పాపము లోకములో ఉండెను గాని ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము ఆరోపింపబడదు. అయినను ఆదాముచేసిన అతిక్రమమును బోలి పాపము చేయని వారిమీదకూడ, ఆదాము మొదలుకొని మోషేవరకు మరణమేలెను; ఆదాము రాబోవువానికి గురుతై యుండెను, అయితే అపరాధము కలిగినట్టు కృపావరము కలుగలేదు. ఎట్లనగా ఒకని అపరాధమువలన అనేకులు చనిపోయినయెడల మరి యెక్కువగా దేవుని కృపయు, యేసు క్రీస్తను ఒక మనుష్యుని కృపచేతనైన దానమును, అనేకులకు విస్తరించెను. మరియు పాపము చేసిన యొకనివలన శిక్షావిధి కలిగినట్టు ఆ దానము కలుగ లేదు. ఏలయనగా తీర్పు ఒక్క అపరాధమూలముగా వచ్చినదై శిక్షావిధికి కారణమాయెను; కృపావరమైతే అనేకమైన అపరాధముల మూలముగా వచ్చినదై మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుటకు కారణమాయెను. మరణము ఒకని అపరాధమూలమున వచ్చినదై ఆ యొకని ద్వారానే యేలినయెడల కృపాబాహుళ్యమును నీతిదానమును పొందువారు జీవముగలవారై, మరి నిశ్చయముగా యేసుక్రీస్తను ఒకని ద్వారానే యేలుదురు. కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యులకందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, ఆలాగే ఒక్క పుణ్య కార్యమువలన కృపాదానము మనుష్యులకందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను. ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయతవలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు. మరియు అపరాధము విస్తరించునట్లు ధర్మశాస్త్రము ప్రవేశించెను. అయినను పాపము మరణమును ఆధారము చేసికొని యేలాగు ఏలెనో, ఆలాగే నిత్యజీవము కలుగుటకై, నీతిద్వారా కృపయు మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా ఏలునిమిత్తము పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను (రోమీ. 5:12–21). వీటిని కూడ చూడుడి: 1 కొరింథీ. 15:22, 45–49; ఎఫెసీ. 2:14–16; 5:23; కొలొస్సీ. 1:18.

[10] ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయతవలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు (రోమీ. 5:19). వీటిని కూడ చూడుడి: మత్తయి 3:15; యోహాను 8:29; 2 కొరింథీ. 5:21; ఫిలిప్పీ. 2:8; హెబ్రీ. 5:8.

*నిబంధన 11*

యేసు క్రీస్తు తన ప్రజల పాపముల నిమిత్తమై సిలువ మీద వారి తరపున నేరస్థునిగా ప్రత్యామ్నాయ ప్రాయశ్చిత్తముగా తన్ను తాను అర్పించుకొనెనని, దేవుని ఉగ్రత నుండి సమాధానము కలిగించెనని మరియు దేవుని నీతిని సంతృప్తి పరచెనని, మరియు పాపము పైన, మరణము పైన, సాతాను పైన విజయవంతుడాయెనని మేము ధృవీకరిస్తున్నాము.[11]

యేసు క్రీస్తు మరణము సాతానుకు విముక్తి వెలగా చెల్లింపబడినదనుటను మేము నిరాకరిస్తున్నాము. యేసు క్రీస్తు మరణము ఒక మాదిరి మాత్రమే అనుటను, సాతానుపై ఒక విజయము మాత్రమే అనుటను, లేదా, దేవుని నైతిక పాలన కనబరుచు ఒక ప్రదర్శన మాత్రమే అనుటను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 12*

యేసు క్రీస్తు మనకొరకు పాపముగా చేయబడెను మరియు ఆయన నీతి విశ్వాసము ద్వారా మనకు పరిగణింపబడెను అను ద్వంద్వ పరిగణల సిద్ధాంతమును మేము ధృవీకరిస్తున్నాము.[12]

పాపము తీర్పు తీర్చబడకుండ ఉండుననునది మేము నిరాకరిస్తున్నాము. యేసు క్రీస్తు యొక్క క్రియాత్మకమైన విధేయత మనకు పరిగణింప బడలేదనుటను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 13*

యేసు క్రీస్తు మూడవ దినమున మృతులలోనుండి లేచెనని మరియు అనేకులు ఆయనను శరీరమందు చూచిరని మేము ధృవీకరిస్తున్నాము.[13]

యేసు క్రీస్తు కేవలము మరణించినట్టు అగుపించెనని, లేక ఆయన ఆత్మ మాత్రమే జీవించెననుటను, లేక ఆయన పునరుత్థానము ఆయనను వెంబడించిన వారి హృదయాలలో మాత్రమే జరిగినదనుటను మేము నిరాకరిస్తున్నాము.

---

[11] పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనువరచవలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటి కాలమందు తన నీతిని కనబరచునిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసముగలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను (రోమీ. 3:25–26). వీటిని కూడ చూడుడి: యెషయా 53; రోమీ. 5:6, 8, 15; 6:10; 7:4; 8:34; 14:9, 15; 1 కొరింథీ. 15:3; ఎఫెసీ. 5:2; 1 థెస్సలొనీ. 5:10; 2 తిమోతి 2:11; హెబ్రీ. 2:14, 17; 9:14–15; 10:14; 1 పేతురు 2:24; 3:18; 1 యోహాను 2:2; 3:8; 4:10.

[12] ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను (2 కొరింథీ. 5:21). వీటిని కూడ చూడుడి: మత్తయి 5:20; రోమీ. 3:21–22; 4:11; 5:18; 1 కొరింథీ. 1:30; 2 కొరింథీ. 9:9; ఎఫెసీ. 6:14; ఫిలిప్పీ. 1:11; 3:9; హెబ్రీ. 12:23.

[13] నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవదినమున లేపబడెను. ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను (1 కొరింథీ. 15:3–5). వీటిని కూడ చూడుడి: యెషయా 53; మత్తయి 16:21; 26:32; 28:1–10; యోహాను 21:14; అపొ.కా. 1:9–11; 2:25, 32; 3:15, 26; 4:10; 5:30; 10:40; రోమీ. 4:24–25; 6:9–10; ఎఫెసీ. 4:8–10.

*నిబంధన 14*

ఆయన మహిమ పరచబడిన స్థితిలో యేసు క్రీస్తు పునరుత్థానమునకు ప్రథమ ఫలముగా ఉన్నాడని, ఆయన పాపమును మరియు మరణమును రెండింటిని జయించి యున్నాడనియు, మరియు ఆయనయందున్న ఐక్యతలో మనము కూడ మృతులలో నుండి లేపబడుదుమని మేము ధృవీకరిస్తున్నాము.[14]

మహిమ పరచబడిన పునరుత్థానమైన యేసు క్రీస్తు యొక్క శరీరము తోటలో ఉన్న సమాధిలో ఉంచబడిన శరీరమునకు పూర్తిగా భిన్నమైనదనుటను మేము నిరాకరిస్తున్నాము. మన పునరుత్థానము మన శరీరములు లేకుండ కేవలము మన ఆత్మల యొక్క పునరుత్థానము మాత్రమే ననుటను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 15*

తండ్రియైన దేవుని కుడి పార్శ్వమున నున్న తన పరలోక సింహాసనమునకు యేసు క్రీస్తు ఆరోహణుడై, ప్రస్తుతము ఆయన రాజుగా ఏలుచున్నాడని మరియు ఆయన శక్తితో మరియు మహిమతో అందరికి కనబడు విధముగా తిరిగి వచ్చునని మేము ధృవీకరిస్తున్నాము.[15]

యేసుక్రీస్తు, తన రాకడ యొక్క సమయము గూర్చి పొరపాటు బడెననునది మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 16*

పెంతెకొస్తు దినమున యేసు క్రీస్తు తన ఆత్మను క్రుమ్మరించెనని మరియు ప్రస్తుత కాలమందు అన్నిటిపైన ఆయన ఏలుచున్నాడనియు, తన ప్రజల గురించి విజ్ఞాపన చేయుచున్నాడనియు, మరియు ఆయనే శిరస్సుగా ఉన్న తన సంఘమును కట్టుచున్నాడనియు మేము ధృవీకరిస్తున్నాము.[16]

రోమా బిషప్‌ను యేసు క్రీస్తు తనకు ప్రతినిధిగా నియమించి యున్నాడనుటను, లేదా యేసు క్రీస్తునకు బదులుగా ఏ వ్యక్తియైనా సంఘమునకు శిరస్సుగా ఉండుటను మేము నిరాకరిస్తున్నాము.

---

[14] ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు....ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? (1 కొరింథీ. 15:20, 55). వీటిని కూడ చూడుడి: రోమీ. 5:10; 6:4, 8, 11; 10:9; 1 కొరింథీ. 15:23; 2 కొరింథీ. 1:9; 4:10–11; ఎఫెసీ. 2:6; కొలొస్సీ. 2:12; 2 థెస్సలొనీ. 2:13; హెబ్రీ. 2:9, 14; 1 యోహాను 3:14; ప్రకటన 14:4; 20:14.

[15] కాబట్టి వారు కూడివచ్చినప్పుడు– ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా? అని ఆయనను అడుగగా ఆయన– కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను. ఈ మాటలు చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్లుచుండగా, వారు ఆకాశమువైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి– గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొన బడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి (అపొ.కా. 1:6–11). వీటిని కూడ చూడుడి: లూకా 24:50–53; అపొ.కా. 1:22; 2:33–35; ఎఫెసీ. 4:8–10; 1 తిమోతి 3:16.

[16] మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను (ఎఫెసీ. 1:22). వీటిని కూడ చూడుడి: అపొ.కా. 2:33; 1 కొరింథీ. 11:3–5; ఎఫెసీ. 4:15; 5:23; కొలొస్సీ. 1:18.

*నిబంధన 17*

ప్రజలందరికీ తీర్పు తీర్చుటకు యేసు క్రీస్తు తన మహిమలో తిరిగి వచ్చునని మరియు తుదకు తన శత్రువులనందరని సంపూర్ణముగా ఓడించి, మరణమును నాశనము చేసి, నూతన ఆకాశము మరియు నూతన భూమిని ప్రవేశపెట్టి వాటిపై నీతితో పరిపాలించునని మేము ధృవీకరిస్తున్నాము.[17]

యేసు క్రీస్తు చివరి రాకడ క్రీ.శ. 70లో జరిగినదని మరియు ఆయన రాకడ మరియు దానికి సంబంధించిన సంఘటనలు కేవలము సంకేతికముగా దృష్టించాలనుటను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 18*

యేసు క్రీస్తు నామమందు విశ్వాసముంచువారు ఆయన నిత్య రాజ్యములోనికి ఆహ్వానించబడుదురని, కాని ఆయనయందు విశ్వాసముంచనివారు నిత్యము స్పృహతో నరకములో శిక్షను అనుభవించుదురని మేము ధృవీకరిస్తున్నాము.[18]

అంత్యమున అందరూ రక్షింపబడుదురనునది మేము నిరాకరిస్తున్నాము. యేసు క్రీస్తునందు విశ్వాసము లేకుండ మరణించువారు సంపూర్ణముగా నాశనము చేయబడుదురనునది మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 19*

భూమి పునాదులు వేయబడక ముందే యేసు క్రీస్తునందు ఎన్నుకొనబడిన వారందరూ మరియు విశ్వాసము ద్వారా ఆయనతో ఐక్యపరచబడిన వారందరూ ఆయనతో మరియు ఒకరితో ఒకరు సహవాసమును అనుభవించుదురని మేము ధృవీకరిస్తున్నాము. యేసు క్రీస్తులో మనము ప్రతి ఆత్మీయ ఆశీర్వాదమును అనగా నీతిమంతులముగా తీర్చబడుట, దత్తపుత్రులమగుట, పరిశుద్ధపరచబడుట మరియు మహిమ పరచబడుట అనునవి అనుభవించుదుమని మేము ధృవీకరిస్తున్నాము.[19]

యేసు క్రీస్తును మరియు ఆయన చేసిన రక్షణ కార్యమును వేరుపరచగల మనునది మేము నిరాకరిస్తున్నాము. యేసు క్రీస్తు లేకుండ యేసు క్రీస్తు చేసిన రక్షణ కార్యములో పాలుపంపులు పొందగలమనునది మేము నిరాకరిస్తున్నాము. ఆయన శరీరమైన సంఘముతో ఐక్యము లేకుండ, యేసు క్రీస్తుతో ఐక్యము కలిగి యుండగలమనునది మేము నిరాకరిస్తున్నాము.

---

[17] ఇదియుగాక దేవుడు సజీవులకును మృతులకును న్యాయాధిపతినిగా నియమించినవాడు ఈయనే అని ప్రజలకు ప్రకటించి దృఢసాక్ష్యమియ్యవలెనని మాకు ఆజ్ఞాపించెను (అపొ.కా. 10:42). వీటిని కూడ చూడుడి: యోహాను 12:48; 14:3; అపొ.కా. 7:7; 17:31; 2 తిమోతి 4:1, 8.

[18] మనుష్యకుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములోనుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులుగలవాడు వినునుగాక (మత్తయి 13:41–43). వీటిని కూడ చూడుడి: యెషయా 256–9; 65:17–25; 66:21–23; దాని. 7:13–14; మత్తయి 5:29–30; 10:28; 18:8–9; మార్కు 9:42–49; లూకా 1:33; 12:5; యోహాను 18:36; కొలొస్సీ. 1:13–14; 2 థెస్సలొనీ. 1:5–10; 2 తిమోతి 4:1, 18; హెబ్రీ. 12:28; 2 పేతురు 1:11; 2:4; ప్రకటన 20:15.

[19] ఏలాగనగా, యూదులమైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి (1 కొరింథీ. 12:13). వీటిని కూడ చూడుడి: యోహాను 14:20; 15:4–6; రోమీ. 6:1–11; 8:1–2; 12:3–5; 1 కొరింథీ. 1:30–31; 6:15–20; 10:16–17; 12:27; 2 కొరింథీ. 5:17–21; గలతీ. 3:25–29; ఎఫెసీ. 1:3–10, 22–23; 2:1–6; 3:6; 4:15–16; 5:23, 30; కొలొస్సీ. 1:18; 2:18–19.

*నిబంధన 20* విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులముగా తీర్చబడుదుము అన్న సిద్ధాంతమును మేము ధృవీకరిస్తున్నాము. మన వ్యక్తిగత యోగ్యత లేక కార్యములద్వారా కాకుండ దేవుడు తన కృపద్వారా మాత్రమే మరియు యేసుక్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు ఆయన నెరవేర్చిన కార్యమందున్న విశ్వాసము ద్వారా మాత్రమే, మనలను దేవుడు నీతిమంతులుగా ప్రకటించునని మేము ధృవీకరిస్తున్నాము. విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులముగా తీర్చబడుదుము అన్న సిద్ధాంతమును తిరస్కరించుట అనగా సువార్తను నిరాకరించుట అని మేము ధృవీకరిస్తున్నాము.[20]

కృపను మనలోనికి చొప్పించుట ద్వారా మనము నీతిమంతుల మయ్యాము అనునది మేము నిరాకరిస్తున్నాము. మనము అంతర్గతంగా నీతిమంతులము అయినప్పుడు మాత్రమే నీతిమంతులముగా తీర్చబడుతాము అనునది మేము నిరాకరిస్తున్నాము. ఈ నీతిమంతులముగా తీర్చబడుట అనునది ఇప్పుడు కాని మరెప్పుడైనా కాని మన నమ్మకత్వము పైన ఆధారపడి యున్నదనుటను మేము నిరాకరిస్తున్నాము.

[20] కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసు క్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమీ. 5:1). వీటిని కూడ చూడుడి: లూకా 18:14; రోమీ. 3:24; 4:5; 5:10; 8:30; 10:4, 10; 1 కొరింథీ. 6:11; 2 కొరింథీ. 5:19, 21; గలతీ. 2:16–17; 3:11, 24; 5:4; ఎఫెసీ. 1:7; తీతు. 3:5, 7.

*నిబంధన 21*

పరిశుద్ధులముగా చేయబడుట అను సిద్ధాంతమును మేము ధృవీకరిస్తున్నాము. దేవుడు, పరిశుద్ధాత్మ శక్తిద్వారా, యేసు క్రీస్తు చేసిన కార్యము మూలముగా, మనపై ఏలుచున్న పాపము యొక్క శక్తినుండి, మనలను విడిపించి, మనలను ప్రత్యేకించి, ఆయన కుమారుని పోలికలో మరింత ఎక్కువగా స్థిరపరచుచూ మనలను దేవుడు పరిశుద్ధ పరచుననుటను మేము ధృవీకరిస్తున్నాము. పరిశుద్ధ పరచబడుట దేవుని కృపాకార్యము, అది నీతిమంతులముగా తీర్చబడుటతో విడదీయలేని సంబంధము కలిగియున్నప్పటికీ, నీతిమంతులముగా తీర్చబడుట అనుదానికి వేరుగా ఉన్నదని మేము ధృవీకరిస్తున్నాము. పరిశుద్ధీకరించు అను దైవ కార్యములో మనము కేవలము నిష్క్రియాత్మకముగా లేము, కాని నియమించబడిన కృపకు మనలను మనము వర్తించుకొనుచు పాపమునకు మరణించి ప్రభువునకు విధేయులమై జీవించుటకు కొనసాగించుచున్న ప్రయత్నములో బాధ్యత కలిగియున్నామని ధృవీకరిస్తున్నాము.[21]

ఒక వ్యక్తి యేసు క్రీస్తుతో పరిశుద్ధ పరచబడుటయందు ఐక్యమైన వెంటనే ఫలములు ఫలించకపోయినప్పటికినీ నీతిమంతుడుగా తీర్చబడుననునది మేము నిరాకరిస్తున్నాము. మన మంచి కార్యములు, యేసు క్రీస్తులో దేవునికి అంగీకారమైనప్పటికినీ, అవి నీతిమంతులముగా తీర్చబడుటకు యోగ్యత కలిగి యున్నవనునది మేము నిరాకరిస్తున్నాము. పాపమునకు మనమీద ఏ అధికారము లేనప్పటికీ, ఈ జీవితములో మనలోనున్న పాపముతో మన పోరాటము ఆగిపోవు నననునది మేము నిరాకరిస్తున్నాము.

[21] మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసు క్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను (ఎఫెసీ. 1:3–4). వీటిని కూడ చూడుడి: యోహాను 17:17; అపొ.కా. 20:32; రోమీ. 6:5–6, 14; 8:13; 1 కొరింథీ. 6:11; 2 కొరింథీ. 7:1; గలతీ. 5:24; ఎఫెసీ. 3:16–19; 4:23–24; ఫిలిప్పీ. 3:10; కొలొస్సీ. 1:10–11; 2 థెస్సలొనీ. 2:13; హెబ్రీ. 12:14.

*నిబంధన 22* దేవునికి ఆయన ప్రజలకు యేసు క్రీస్తు ఒక్కడే మధ్యవర్తిగా ఉన్నాడనుటను మేము ధృవీకరిస్తున్నాము. దీన స్థితిలో ఉన్నప్పుడు కాని మరియు హెచ్చింపబడిన స్థితిలో ఉన్నప్పుడు కాని యేసు క్రీస్తు మనకొరకు ప్రవక్తగా, యాజకుడుగా, రాజుగా మధ్యవర్తిత్వ పాత్రను వహించాడని మేము ధృవీకరిస్తున్నాము. ఈ మధ్యవర్తిత్వ కార్యమును నిర్వహించుటకు తండ్రిచేత పిలువబడిన ఆయన పరిశుద్ధాత్మచేత అభిషేకించబడెనని మేము ధృవీకరిస్తున్నాము.[22]

ఇంతకు ముందు దేవుడు మరొక అవతారమెత్తెనని కాని ఇక ముందు ఇంకొక అవతార మెత్తునని కాని ప్రభువైన యేసు క్రీస్తు తప్ప మరెవరైన మన విమోచనకు మధ్యవర్తిగా ఉందురనుటను గాని మేము నిరాకరిస్తున్నాము. యేసు క్రీస్తు తప్ప మరి ఎవనివలననైనను రక్షణ కలదనుటను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 23* దేవుని యొక్క మహోన్నతమైన ప్రవక్తగా, యేసు క్రీస్తు ప్రవచనముల పాఠ్యాంశము మరియు విషయమై యున్నాడని మేము ధృవీకరిస్తున్నాము. యేసు క్రీస్తు దేవుని చిత్తమును బయలు పరచెననియు మరియు ప్రకటించెననియు, భవిష్య కాలపు సంఘటనలను ప్రవచించెననియు, మరియు ఆయనలోనే దేవుని వాగ్దానములు నెరవేర్చబడెననియు మేము ధృవీకరిస్తున్నాము.[23]

తప్పుడు ప్రవచనమును లేక తప్పుడు వాక్యమును యేసు క్రీస్తు ఎప్పుడైన పలికెనని గాని లేదా ఆయనకు సంబంధించిన ప్రవచనములన్నిటినీ నెరవేర్చుటలో విఫలుడాయెనని లేదా విఫలుడవునను ఆక్షేపణను గాని మేము నిరాకరిస్తున్నాము.

---

[22] దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్య వర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు (1 తిమోతి 2:5). వీటిని కూడ చూడుడి: యోబు 33:23–28; లూకా 1:33; యోహాను 1:1–14; 14:6; అపొ.కా. 3:22; కొలొస్సీ. 1:15; హెబ్రీ. 1:1–4; 5:5–6; 9:15; 12:24.

[23] సహోదరులారా, మీరును మీ అధికారులును తెలియక చేసితిరని నాకు తెలియును. అయితే దేవుడు తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగు నెరవేర్చెను. ప్రభువు సముఖము నుండి విశ్రాంతికాలములు వచ్చునట్లును మీకొరకు నియమించిన క్రీస్తుయేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి. అన్నిటికి కుదురుబాటు కాలములు వచ్చునని దేవుడు ఆదినుండి తన పరిశుద్ధ ప్రవక్తలనోట పలికించెను. అంతవరకు యేసు పరలోక నివాసియై యుండుట ఆవశ్యకము. మోషే యిట్లనెను– ప్రభువైన దేవుడు నావంటి యొక ప్రవక్తను మీ సహోదరులలోనుండి మీకొరకు పుట్టించును; ఆయన మీతో ఏమి చెప్పినను అన్ని విషయములలో మీరాయన మాట వినవలెను (అపొ.కా. 3:17–22). వీటిని కూడ చూడుడి: మత్తయి 20:17; 24:3; 26:31, 34, 64; మార్కు 1:14–15; లూకా 4:18–19, 21; యోహాను 13:36; 21:22; 1 కొరింథీ. 1:20; హెబ్రీ. 1:2; ప్రకటన 19:10.

*నిబంధన 24*

మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసు క్రీస్తు మనకు గొప్ప ప్రధాన యాజకుడని, మన కొరకు ఆయన తన్ను తాను సంపూర్ణ బలియాగముగా అర్పించుకొని ఎల్లప్పుడు తండ్రి ఎదుట మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడని మేము ధృవీకరిస్తున్నాము. ప్రాయశ్చిత్తము కొరకు అత్యున్నతమైన బలిదానముగా యేసు క్రీస్తు తానే పాత్యాంశము మరియు విషయమై యున్నాడని మేము ధృవీకరిస్తున్నాము.[24]

లేవి గోత్రమునుండి కాకుండ, యేసు క్రీస్తు యూదా గోత్రమునుండి వచ్చెను కాబట్టి, మనకు యాజకుడుగా ఉండుటకు ఆయన అనర్హుడు అన్న వాదనను మేము నిరాకరిస్తున్నాము. కేథలిక్కుల మాస్ ఆచరణలో భావిస్తున్నట్టుగా ఆయన బాధితుడుగాను మరియు యాజకుడుగాను, తన్ను తాను విరమించని రక్తంలేని బలియాగముగా అర్పించుకొంటున్నాడను వాదనను మేము నిరాకరిస్తున్నాము. ఆయన పరలోకంలోనే యాజకుడయ్యాడని మరియు ఈ భూలోకంలో యాజకుడుగా లేడను వాదనను మేము నిరాకరిస్తున్నాము.

*నిబంధన 25*

రాజుగా, యేసు క్రీస్తు సర్వోన్నతాధికారంతో ఇహలోకంపై మరియు మానవాతీతమైన శక్తులపై ఇప్పుడు ఎల్లప్పుడు పరిపాలించునని మేము ధృవీకరిస్తున్నాము.[25]

ఈ ప్రపంచంలో యేసు క్రీస్తు రాజ్యపాలన ఇహలోక సంబంధమైన రాజకీయ పాలననునది మేము నిరాకరిస్తున్నాము. ఇహలోక రాజ్యపాలకులు ఆయనకు జవాబుదారులు కారనునది మేము నిరాకరిస్తున్నాము.

---

[24] అందువలన నిజమైన పరిశుద్ధస్థలమును పోలి హస్తకృతమైన పరిశుద్ధస్థలములలో క్రీస్తు ప్రవేశింప లేదు గాని, యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను. అంతేకాదు, ప్రధానయాజకుడు ప్రతి సంవత్సరము తనదికాని రక్తము తీసికొని పరిశుద్ధస్థలములోనికి ప్రవేశించినట్లు, ఆయన అనేక పర్యాయములు తన్నుతాను అర్పించుకొనుటకు ప్రవేశింపలేదు. అట్లయినయెడల జగత్తుపునాది వేయబడినది మొదలుకొని ఆయన అనేక పర్యాయములు శ్రమపడవలసివచ్చును. అయితే ఆయన యుగముల సమాప్తియందు తన్నుతానే బలిగా అర్పించుకొనుటవలన పాపనివారణ చేయుటకై యొక్కసారే ప్రత్యక్షపరచబడెను. మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును. ఆలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్క సారే అర్పింపబడి, తనకొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపములేకుండ రెండవసారి ప్రత్యక్షమగును (హెబ్రీ. 9:24–28). వీటిని కూడ చూడుడి: యోహాను 1:36; 19:28–30; అపొ.కా. 8:32; 1 కొరింథీ. 5:7; హెబ్రీ. 2:17–18; 4:14–16; 7:25; 10:12, 26; 1 పేతురు 1:19; ప్రకటన 5:6, 8, 12–13; 6:1, 16; 7:9–10, 14, 17; 8:1; 12:11; 13:8; 15:3.

[25] ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను (1 కొరింథీ. 15:25). వీటిని కూడ చూడుడి: కీర్తన 110; మత్తయి 28:18–20; లూకా 1:32; 2:11; అపొ.కా. 2:25, 29, 34; 4:25; 13:22, 34, 36; 15:16; రోమీ. 1:3; 2 తిమోతి 2:8; హెబ్రీ. 4:7; ప్రకటన 3:7; 5:5; 22:16.

*నిబంధన 26* యేసు క్రీస్తు తన శత్రువుల నందరిని జయించిన తర్వాత, తన రాజ్యమును తండ్రికి అప్పగించునని మేము ధృవీకరిస్తున్నాము. క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమియందు, దేవుడు తన ప్రజలతో ఉంటాడనియు మరియు విశ్వాసులు యేసు క్రీస్తును ముఖాముఖిగా చూచుదురనియు, ఆయన వలే చేయబడుదురనియు, మరియు ఎల్లకాలము ఆయనతో ఆనందించుదురనియు మేము ధృవీకరిస్తున్నాము.[26]

యేసు క్రీస్తులో తప్ప మానవులకు మరొక నిరీక్షణ కాని మరొక నామమున కాని మరొక మార్గమున కాని రక్షణ కలదనుటను మేము నిరాకరిస్తున్నాము.

---

[26] అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము. దేవుడు సమస్తమును క్రీస్తు పాదములక్రింద లోపరచియుంచెను. సమస్తమును లోబరచబడియున్నదని చెప్పినప్పుడు ఆయనకు సమస్తమును లోబరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే. మరియు సమస్తమును ఆయనకు లోబరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోబరచిన దేవునికి తానే లోబడును (1 కొరింథీ. 15:24–28). వీటిని కూడ చూడుడి: యెషయా 65:17; 66:22; ఫిలిప్పీ. 2:9–11; 2 పేతురు 3:13; 1 యోహాను 3:2–3; ప్రకటన 21:1–5; 22:1–5.

# విశదపరచే వ్యాసం

వాడుకొనుటకు
అవసరమైన సలహాలతో

ఒకరోజు భూమి అంతా "యేసు క్రీస్తు ప్రభువు" (ఫిలిప్పీ. 2:11) అను ఒకే ఒక ఒప్పుకోలుతో మారుమ్రోగుతుంది. ఈ చిన్న వాక్యం ఎంతో అర్థముతో పొంగి పొర్లుతున్నది. యేసే క్రీస్తు అని చెప్పడమంటే, ఆయన "అభిషేకించ బడినవాడు" అని చెప్పడం. అంటే ఆయన వాగ్దానము చేయబడిన, మరియు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న "మెస్సయ్య" అని చెప్పడం.

యేసు క్రీస్తు ప్రభువని చెప్పడమంటే ఆయన నిజమైన దేవుని యొక్క నిజమైన దేవుడు అని చెప్పడం. ఆయన శరీరధారిగా అవతరించుట మహా అద్భుతమైన, ఒక ఆశ్చర్యపరచే మర్మము. దేవుడు శరీరధారి ఆయెను. ఆయనను యేసు అని పిలవడం అంటే ఆయనే ఒక్కగానొక్క రక్షకుడని చెప్పడమే. ఆయన ఈ లోకానికి రావడం యొక్క లక్ష్యము తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించుట (మత్తయి 1:21).

"యేసు క్రీస్తు ప్రభువు" అనునది క్రైస్తవ మత విశ్వాస సిద్ధాంతము—ఆ విశ్వాసమును సంక్షిప్తముగా తెలియ చేయు వాక్యము. ఆంగ్లములో *"క్రీడ్" (creed)* అను పదము, లాటిన్ పదం *"క్రెడొ" (credo)* నుండి వచ్చింది; దాని అర్థం "నేను నమ్ముతున్నాను". ఈ చిన్న మత విశ్వాస సిద్ధాంతము, క్రీస్తును గూర్చి మనం ఏమి విశ్వసిస్తున్నామో ప్రకటిస్తుంది. కొందరు 1 తిమోతి 3:16 కూడ ఒక మత విశ్వాస సిద్ధాంతము అని అనుకుంటారు. దీనికి రెండు కారణాలు గలవు. మొదటిగా, "గొప్పదైనది, వాస్తవంగా, *మనం ఒప్పుకొంటున్నాము*" అను భావ వ్యక్తీకరణలు పౌలు వాడుతున్నాడు. రెండవదిగా, ఈ వచనంలోని పద సమూహము లయబద్ధంగా మరియు కవిత్వంలా వ్యక్తపరచబడినవి. ఈ పద సమూహము శరీరధారిగా అవతరించిన యేసును గూర్చి సంక్షిప్తమైన సారాంశముగా రూపొందించినవి:

> ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను.
> ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను
> దేవదూతలకు కనబడెను
> రక్షకుడని జనములలో ప్రకటింపబడెను
> లోకమందు నమ్మబడెను
> ఆరోహణుడై తేజోమయుడయ్యెను. (1 తిమోతి 3:16)

బైబిలు గ్రంథములో వివరించబడిన క్రమము ముఖ్యము. ఆది సంఘము సమితిలను ఏర్పాటు చేసినపుడు మరియు మత సిద్ధాంతములను తయారు చేసినపుడు, తమ విశ్వాసమును ప్రకటించుటకు ఒక క్రొత్త విధానమును తయారు చేయలేదు. బైబిలు గ్రంథములో నియమించబడిన సంప్రదాయక విధానములనే వారు కొనసాగించారు.

సవాళ్ళు తలెత్తినప్పుడు, ఆది సంఘము గట్టిగా నిలబడింది. అంతేకాక, సామూహిక దైవ ప్రార్థనా పద్ధతి యొక్క అవసరత, మరియు స్వచ్ఛమైన ఆరాధన చేయాలనే ఆసక్తి కూడ సంఘము మత సిద్ధాంతములను వ్రాతపూర్వకముగా తయారుచేయుటకు నిమగ్నమయ్యేలా చేసిందని అనేకుల భావన. క్రీస్తును గూర్చిన సిద్ధాంత విషయములో ఇది విశేషమైన సత్యము. యేసు యొక్క వ్యక్తిత్వము,

మరియు కార్యము గురించిన సారమైన సత్యము, శతాబ్దాలుగా క్రైస్తవ్యాన్ని నిర్వచించుటకు ఒక ప్రమాణ చిహ్నంగా ఉండిపోయింది.

క్రీస్తు యొక్క వ్యక్తిత్వము, పని గురించిన తప్పుడు ఆలోచనలతో క్రొత్త నిబంధన రచయితలు సహితము పోరాడిరి. సంఘము ఏర్పడిన ప్రారంభ శతాబ్దములలో వివిధ గుంపులు క్రీస్తు యొక్క నిజమైన మానవత్వము గురించి సవాలు చేసారు. డొసెటిస్ట్స్ (Docetists) అనే ఒక గుంపు, యేసు కేవలము మానవుడి లాగా "కనిపించెను" అని వాదించిరి. ఏరియనిజం (Arianism) అను పేరే భిన్న మత సిద్ధాంతములు గలవారు, క్రీస్తు యొక్క నిజమైన దైవత్వమును సవాలు చేసిరి. ఈ భిన్న సిద్ధాంతములవారు ఆయన తండ్రియైన దేవునికంటె తక్కువవాడని వాదించిరి. ఆ తరువాత వచ్చిన గుంపులు యేసు క్రీస్తు యొక్క నిజమైన మానవత్వము మరియు నిజమైన దైవత్వము అను ఈ రెండు స్వభావములు ఒకే ఒక వ్యక్తిలో ఇమిడి యున్నవని చెప్పుటలో పొరపాట్లు చేసారు. ఆది సంఘము ఈ సవాళ్ళకు మరియు పొరపాట్లకు జవాబు ఇచ్చుటకు సమితిలను సమావేశపరచి, మరియు బైబిలు బోధించే క్రైస్తవ విశ్వాసము యొక్క ప్రధాన సత్యములను సంగ్రహపరచి మత సిద్ధాంతములను వ్రాసిరి. ఈ మత సిద్ధాంతములు ఒక తరము నుండి మరొక తరమునకు ఇవ్వబడిన ఒక గొప్ప వారసత్వము. కాబట్టి ఈ దినమున మనము, అపొస్తలుల క్రీడ్, నైసీన్ క్రీడ్, మరియు చాల్సిడోనియన్ నిర్వచనం (Definition) అను వనరులు కలిగి యున్నాము. ఈ మత సిద్ధాంతములు సరిహద్దు గుర్తులు, సనాతనమైన మరియు భిన్న మత సిద్ధాంతములను పేరు పరచు స్పష్టమైన గీతలు.

ఈ మత సిద్ధాంతములు సంఘమును బలపరచుటకు ఉపయోగపడెను. మరియు క్రైస్తవులు నమ్మకముగా సువార్తను ప్రకటించుటకు దేవుని యొక్క పరిపాలించే కృపాహస్తాలు నడిపించెను. వాటి యొక్క శాశ్వతమైన విలువకు సాక్ష్యముగా ఈ దినమున ఇవి వల్లించబడుతున్నాయి. క్రైస్తవ వేదాంత శాస్త్రమునకు క్రీస్తు ప్రధాన కేంద్రముగా ఉన్నాడని మరియు మన ఆరాధనలో ప్రధాన కేంద్రముగా ఉన్నాడని అవి మనకు జ్ఞాపకము చేయుచున్నవి. "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము పోరాడవలెనని" (యూదా 1:3) ఈ మత సిద్ధాంతములు సంఘమును పిలుచుచున్నవి.

అయినప్పటికీ, ఈ మత సిద్ధాంతములు క్రీస్తు చేసిన పనిని మాత్రమే సూచించుచున్నవి. అవి సువార్తను సంపూర్ణముగా వివరించవు. దృశ్యమాన సంఘములో, నిజమైన విభజన మత సంస్కరణ జరిగిన సమయములో సంభవించెను. యేసు యొక్క పని కీలకమైన విషయము. మరి ముఖ్యముగా, మత సంస్కరణ రగిలించిన ప్రధాన వివాదాస్పద అంశము, విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులముగా తీర్చబడుదుము అన్న సిద్ధాంతముపై జరిగిన చర్చ. ఇక్కడ ప్రొటెస్టాంటిజమ్ మరియు రోమన్ కేథాలిసిజంగా సంఘం విభాగింపబడింది. విశ్వాసము ద్వారానే నీతిమంతులముగా *(సోలాఫిడె)* తీర్చబడుదుము అన్న సిద్ధాంతమును ప్రొటెస్టాంటిజమ్ ధృవీకరిస్తుంది. అయితే కౌన్సిల్ ఆఫ్ ట్రెంట్ ఇచ్చిన మత సంస్థ ఆదేశం అనుసరించి రోమన్ కేథాలిసిజం, విశ్వాసము ద్వారానే నీతిమంతులముగా తీర్చబడుదుము అన్న సిద్ధాంతమును తిరస్కరించి, దానికి బదులుగా విశ్వాసము మరియు పనుల మధ్య సహకారము ద్వారా వచ్చిన ఫలితము వలన నీతిమంతులముగా తీర్చబడుదుము అనునది ఎన్నుకొన్నారు. మత సంస్కరణ మరొక విషయము మీద కూడ వ్యత్యాసమును బహిర్గతము చేసెను, అదేమిటంటే,

యేసు క్రీస్తు యొక్క అత్యున్నతమైన మరియు ఒకే ఒక్క ప్రధానత్వము ఆయన సంఘము మీద మరియు నిజానికి అన్నిటి మీద కలిగి యున్నది.

వీటన్నిటిని కలిపి తీసుకొంటే, ఆది సంఘము యొక్క క్రైస్తవ సంబంధ (ecumenical) మత సిద్ధాంతములు మరియు మత సంస్కరణ, బైబిలులోని సువార్తను నమ్మకముగా ప్రకటించుటకు సంఘము మార్గదర్శకాలను ఏర్పరచుకోవటానికి ఉద్ఘాటించాయి. క్రైస్తవ మత సిద్ధాంతములు మరియు అనేక మత సంస్కరణ ఒప్పుకోలులు మరియు మత సంబంధిత ప్రశ్నోత్తర గ్రంథం (కాటెచిజం), విశ్వాసమునకు చెందిన సారాంశములను అందించి విశ్వాసముకు మరియు సువార్తకు స్పష్టతను తీసుకొని వచ్చాయి.

వాక్యము శరీరధారి ఆయెను: క్రీస్తు వ్యక్తిత్వముపై లిగోనియర్ వ్యాఖ్య ఈ తరము యొక్క సంఘముకు వినయ పూర్వకముగా—మరియు, దేవుని దీవెనలతో రాబోవు తరము వారికి కూడ ఇచ్చుటకు ప్రయత్నించుచున్నది—మరియు క్రైస్తవ మత సంబంధ సిద్ధాంతములు మరియు మత సంస్కరణ వేదాంత శాస్త్రము గతములోని ఐశ్వర్యము నుండి క్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యము గురించి క్లుప్తముగా నివేదిస్తున్నది. బహుశ ఈ వ్యాఖ్య మరియు దానితోపాటు పొందుపరచిన ధృవీకరణలు మరియు నిరాకరణలు కలిగిన ఇరవై ఆరు నిబంధనలు ముందు ముందు జరుగబోయే చర్చలకు ఉత్ప్రేరకంగా పని చేయవచ్చు మరియు క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమునకు సంబంధించిన కీలకమైన విషయాలపై ప్రతిబింబించవచ్చు. బహుశ ఈ వ్యాఖ్య దానంతట అదే సంఘముకు సహాయకరముగా ఉండవచ్చు. ఈ వ్యాఖ్య ప్రజలు వల్లించుటకు అనుకూలముగా ఉండునట్లు ప్రతి ప్రయత్నము చేయబడింది. ఈ వ్యాఖ్యను ఎదుర్కొనిన ప్రతి వ్యక్తి “యేసు క్రీస్తు ప్రభువు” అని తెలుసుకోవాలని మా కోరిక.

**వ్యాఖ్య**

ఈ వ్యాఖ్యలో ఆరు చరణములు లేక విభాగములు కలవు. ఉపోద్ఘాతమైన మొదటి చరణములో రెండు కీలకమైన క్రియా పదాలు కలవు: *ఒప్పుకొనుట* మరియు *ఆనందించుట*. పరిశుద్ధ లేఖనములలో దేవుడు తనను తాను మరియు తన చిత్తమును వెల్లడిపరచెను. అయినప్పటికీ, ఆయనకు మాత్రమే చెందిన “రహస్యములు” ఇంకా కలవు (ద్వితీ. 29:29). మత పరమైన ఈ వేదాంత శాస్త్రము యొక్క విధిలో మన పరిమితుల గురించి మనం జాగరూకతతో ఉండాలి. కాబట్టి మనము సువార్త యొక్క *మర్మ*ము మరియు *అద్భు*తమును ఒప్పుకొంటూ మొదలుపెట్టవలెను. ఈ వ్యాఖ్యలో శరీరధారియాయెను అనుదానిమీద ప్రాథమిక దృష్టి నిలిపి, దానిని ‘*దేవుడు శరీరధారియాయెను*’ అని మనము క్లుప్తముగా నిర్వచించుచున్నాము. క్రీస్తు యొక్క వ్యక్తిత్వము, వెంటనే క్రీస్తు యొక్క కార్యమునకు నడిపించును, కాబట్టి క్రీస్తు యొక్క రక్షణకార్యమందు మనమందరము ఆనందించుచున్నాము.

రెండవ చరణము, క్రీస్తు యొక్క నిజమైన దైవత్వమును ఉద్ఘాటిస్తూ, త్రియేక దైవత్వములో మిగతా వ్యక్తులతో సమాన స్థాయిలో ఆయన ఉన్నాడనుటను చూపిస్తుంది. చాల్సిడన్ నిర్వచనం నుండి చాల్సిడోనియన్ నియము తిరిగి చెప్పబడుటతో ఈ చరణము ముగింపబడుతుంది. శరీరధారియైనప్పటినుండి, ఒకే వ్యక్తి అనగా క్రీస్తులో ఈ రెండు స్వభావములు ఇప్పుడు మరియు ఎల్లప్పుడు ఇమిడి ఉండును.

మూడవ చరణములో శరీరధారియాయెను అను వ్యాఖ్యానము ఇవ్వబడింది, దానిలో క్రీస్తు యొక్క నిజమైన మానవత్వమును నొక్కిచెప్పుచున్నది. ఆయన

జన్మించెను, ఆయన ఇమ్మానుయేలు, అనగా "దేవుడు మనకు తోడు" అని అర్థము (మత్తయి 1:23). ఇక్కడ ఆయన మరణము, సమాధి చేయబడుట, పునరుత్థానుడగుట, ఆరోహణుడగుట మరియు రెండవ రాకడను మనము ఒప్పుకొనుచున్నాము. శరీరధారియాయెననుటకు ఇవి చారిత్రాత్మిక సత్యములు.

శరీరధారియాయెననుటకు వేదాంత శాస్త్రము యొక్క సత్యములు నాలుగవ విభాగములో కలవు. ఇవి మత సంస్కరణ అయిన సమయమునుండి తిరిగి సంపాదించిన అంతర్గత నిజాలనుండి తీసికొనబడినవి. మన కొరకు, యేసు సంపూర్ణముగా విధేయుడై యుండెను. ఆయన *ధర్మ శాస్త్రమును పాటించెను* (ఇది క్రియాత్మకమైన విధేయత) మరియు ధర్మశాస్త్రము యొక్క దండన చెల్లించెను (ఇది నిష్క్రియాత్మకమైన విధేయత). ఆయన నిష్కళంకమగు గొఱ్ఱెపిల్ల, మనకొరకు ప్రత్యామ్నాయ ప్రాయశ్చిత్తము చేసెను. మానవాళి సంతతిని ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యను ఆయన పరిష్కరించెను: ఇది పరిశుద్ధ దేవుని యొక్క ఉగ్రత. పరిగణింపబడుట అను సిద్ధాంతముతో ఈ చరణము ముగియును. మన పాపములు క్రీస్తుకు పరిగణింపబడ్డాయి లేక లెక్కించబడ్డాయి, అదే సమయములో ఆయన నీతి మనకు పరిగణించబడెను. కేవలము మరియు ప్రత్యేకముగా క్రీస్తు మనకొరకు చేసిన కార్యమునుబట్టి మనము దేవునితో సమాధానము కలిగియున్నాము. ఆయన నీతిని మనము ధరించియున్నాము.

క్రీస్తు యొక్క మూడింతల పదవి *(munus triplex)* ఆయన కార్యమును క్లుప్తముగా వెల్లడి పరచుటకు ఒక సహాయకరమైన వేదాంతశాస్త్ర ఏర్పాటు. పాత నిబంధనలో ప్రవక్త, యాజకుడు మరియు రాజు అను ఈ మూడు పదవులు వేరు వేరు మధ్యవర్తిత్వపు పాత్రలు. యేసు తన వ్యక్తిత్వములో ఈ మూడింటిని ఇమిడ్చి, మరియు వాటన్నిటిని సంపూర్ణముగా నెరవేర్చెను. ఇక్కడ మనము గతంలో సిలువమీద క్రీస్తు చేసిన మధ్యవర్తిత్వపు కార్యము మీద మాత్రమే కాక తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండి మన మధ్యవర్తిగా ఆయన ప్రస్తుతము చేయుచున్న పని మీద కూడ ధ్యానించుచున్నాము.

చివరి చరణము ధృవీకరిస్తున్న ఏకైక, సంక్షిప్తమైన ఒప్పుకోలు: *యేసు క్రీస్తు ప్రభువు*. ప్రతి నిజమైన వేదాంతశాస్త్రము దైవ స్తుతికి మరియు ఆరాధనకు నడిపించును. తత్ఫలితంగా ఈ వ్యాఖ్య '*స్తుతించుట*' అను కీలకమైన క్రియాపదముతో ముగియుచున్నది. ఇప్పుడు మనము క్రీస్తును ఆరాధించుటద్వారా శాశ్వతముగా మనము చేయబోవు మన కార్యము కొరకు సిద్ధపడుచున్నాము.

### ధృవీకరణలు మరియు నిరాకరణలు కలిగిన ఇరవై ఆరు నిబంధనలు

ఈ వ్యాఖ్యలోని పదజాలము క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమును పఠించుటకు ప్రవేశ ద్వారము, యేసు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యము మీద ఐశ్వర్యవంతమైన బైబిలు బోధనను అన్వేషించుటకు ఆహ్వానించుచున్నది. మనలను ముందుకు నడిపించుటకు, ధృవీకరణలు మరియు నిరాకరణలు కలిగిన ఈ ఇరవై ఆరు నిబంధనలు జోడించబడినవి, ప్రతి ఒక్కటి లేఖనముల రుజువుల సహకారంతో ఉన్నది. ప్రతి ఒక్కదానికి ఒక ప్రధానమైన వాక్యము సంపూర్తిగా వ్రాయబడినది, దానితోబాటు ఇతర మద్దతునిచ్చే వాక్యములు ఇవ్వబడినవి. ఈ నిబంధనలు కీలకమైనవి. అవి యేసు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యము మీద బైబిలు చెప్పే బోధనలకు సరిహద్దులను పెట్టును.

నిబంధన 1 ఉపోద్ఘాతముగా పనిచేయుచూ, శరీరధారి ఆయెను అనునది ధృవీకరిస్తుంది.

నిబంధన 2 క్రీస్తు యొక్క దైవత్వమును నొక్కిచెప్తుంది, అయితే, నిబంధనలు 3–5 బైబిలు గ్రంథము యొక్క ఒకే ఒక వ్యక్తి, ద్వంద్వ స్వభావము గల క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రమును ప్రదర్శిస్తున్నాయి. నిబంధనలు 6–9 క్రీస్తు యొక్క నిజమైన మానవత్వమును విశదపరచుచున్నవి. నిబంధనలు 10–26 క్రీస్తు వ్యక్తిత్వము నుండి క్రీస్తు చేసిన కార్యమునకు మళ్ళుచున్నవి. ఇవి రక్షణ సిద్ధాంతములను ధృవీకరించుటతో మొదలు పెట్టి క్రీస్తు యొక్క మూడు పదవులను వర్ణించుటతో ముగియుచున్నవి.

నిరాకరణలు ఎంతో ప్రాముఖ్యమైనవి. ఒక నమ్మికను నిరాకరించుట అనునది ఈ సహించే యుగములో అనాగరికమైనది, కాని ఈ ధృవీకరణలు మరియు నిరాకరణలు కలిగిన నిబంధనలు గర్వముతో కూడిన భావనలను సాధకము చేసినవి కావు. అందుకు బదులుగా, బైబిలు బోధ యొక్క హద్దులలో సంఘము క్షేమముగా మరియు పచ్చగా ఉండుటకు సహాయపడుతుందన్న నిరీక్షణతో ఇవి ఇవ్వబడినవి. రెండవ యోహాను 9లో "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" అని చెప్పబడెను. క్రీస్తు గురించి బైబిలు బోధించే బోధనను దాటి ముందుకు సాగిపోవడం గురించి ఇది చెప్పుచున్నది, లేదా దేవుని వాక్యములో వెల్లడించిన క్రీస్తు వ్యక్తిత్వ శాస్త్రము గురించి నిర్దేశించబడిన సరిహద్దులు మించి ముందుకు సాగుట. ఈ ఇరవై ఆరు నిబంధనలు ఈ వ్యాఖ్య యొక్క వివిధ పంక్తులను వివరించుచున్నవి, ఈ విధముగా నిబంధనలు తమంతట తామే క్రీస్తు గురించి బైబిలు బోధనలోకి మరింత లోతుగా నడిపించును.

అసలు ఈ క్రొత్త వ్యాఖ్య ఎందుకు అవసరము అని కొందరు సరిగ్గానే ప్రశ్నించవచ్చు. అది ఒక మంచి ప్రశ్నయే. అందుకు, ఈ వ్యాఖ్యకు మేము మూడు కారణములు ఇచ్చుచున్నాము. ఇవి సంఘ ఆరాధనలో మరియు ఈ నాటి బోధలో, ప్రాచీన మరియు ఆధునిక సవాళ్ళను సంబోధించుటకు సహాయపడునని మేము నమ్ముచున్నాము. సువార్త సేవలో ఉన్నవారు, సేవలో ఎవరు నిజమైన భాగస్వామ్యము కలిగి ఉన్నారో గుర్తు పట్టుటకు తోడ్పడుతుందని మేము నమ్ముచున్నాము. చివరిగా, సంఘము సవాళ్ళను ఎదుర్కొనే సమయము ఆసన్నమైనదని మేము గ్రహిస్తున్నాము, మరియు సువార్త యొక్క సారాంశమును మనకు ఈ వ్యాఖ్య గుర్తు చేయునని మేము నమ్ముచున్నాము—దాని సౌందర్యము, దాని అవసరత మరియు దాని ఆవశ్యకత. ఈ ఒక్కొక్క కారణములను పరిశీలించండి:

### ఆరాధన మరియు క్షేమాభివృద్ధి కొరకు

లిగోనియర్ ఈ వ్యాఖ్యను వినయపూర్వకముగా సంఘమునకు అందించెను. ముందు శతాబ్దములనుండి, క్రైస్తవులు సంఘము యొక్క ప్రార్థనా ప్రకరణములో మత సిద్ధాంత సంపుటిలను వాడిరి. ఈ వ్యాఖ్య కూడ అదే లక్ష్యమును నిర్వర్తించునని నిరీక్షించ బడుచున్నది. బైబిలు బోధన యొక్క విస్తారమైన సరిహద్దులను అన్వేషించుటకు క్రైస్తవ మత సిద్ధాంత సంపుటిలు సహాయకరమైన బోధన పనిముట్లుగా ఉండగలవు. బైబిలును అన్వేషించటానికి మరియు ధ్యానించటానికి ఈ వ్యాఖ్య మరియు ఇరవై ఆరు నిబంధనలు ఒక మార్గదర్శిగా ఉండగలవని నమ్ముచున్నాము. సంఘము

యొక్క ఉనికికి, మరియు ఆరోగ్యానికి యేసు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యముకు సంబంధించిన సిద్ధాంతములు ఆత్యవసరము. క్రీస్తు వ్యక్తిత్వము మరియు కార్యము గురించి సంప్రదాయ సిద్ధమైన జ్ఞానమును సంఘములో ప్రతి తరమువారు అధ్యయనం చేయుట మరియు మళ్ళీ క్రొత్తగా ధృవీకరించుట అవసరము. ఈ వ్యాఖ్య సహాయకరముగా నుండునని మేము నమ్ముతున్నాము.

**సువార్తలో అందరికీ వర్తించే కారణము కొరకు**

నిర్దిష్ట వర్గానికి చెందని సంఘములు, సంస్థలు మరియు ఉద్యమాల సంఖ్య ప్రపంచంలో ఎన్నో పెరుగుచున్నవి—వాటిలో ఎన్నో సువార్తను పురోగమింప చేయుచున్నవి. వాటిలో ఎవరితోనైన ఆరోగ్యకరమైన భాగస్వామ్యము మరియు సాంగత్యము కలదని గ్రహించుట కొన్నిసార్లు కష్టము. క్రీస్తునందు తోటి సహోదరులను మరియు సహోదరీలను గుర్తించుటకు మరియు సువార్త కొరకు అందరు చేస్తున్న ప్రయత్నములను ధృఢపరచుకొనుటకు ఈ వ్యాఖ్య బహుశ సహాయము చేయవచ్చు.

**ఇటువంటి సమయము కొరకు**

థామస్ క్రాన్మర్, నికొలాస్ రిడ్లీ మరియు హ్యూ లాటిమర్ లాంటి అనేక బ్రిటన్ సంస్కర్తలు చేసిన త్యాగము జ్ఞాపకార్ధముగా అమరవీరుల స్మారక చిహ్నం (Martyrs' Monument), ఆక్స్‌ఫోర్డ్ యూనివర్సిటి ఉన్న పట్టణములో కలదు. వారు తమ శరీరములను కాల్చబడుటకు అప్పగించిరి, రోమా సంఘము యొక్క దోషములకు వ్యతిరేకముగా పవిత్రమైన సత్యమునకు సాక్షులుగా ఉంటూ వాటిని ధృవీకరించి మరియు కొనసాగించిరి మరియు క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమ పడుటకు వారికి అనుగ్రహింపబడెనని వారు సంతోషించిరని ఈ స్మారక చిహ్నం తెలియపరచుచున్నది.

యేసు క్రీస్తు యొక్క సువార్తలోని పవిత్రమైన సత్యములను వారు విశ్వసించిరి, ధృవీకరించిరి మరియు కొనసాగించిరి. ఈ సత్యములకు సాక్షులుగా నిలబడుతూ, వారు వాటిని ప్రకటించిరి, కాపాడిరి మరియు వాటికొరకు శ్రమలను కూడ అనుభవించిరి. చాలా శతాబ్దములుగా చాలా మంది ఈ మత సంస్కర్తలతో చేరిరి. ఆధునిక పాశ్చాత్య ప్రపంచంలో సంఘము చాలమట్టుకు మత సంబంధమైన స్వాతంత్ర్యమును అనుభవించెను. ఎంత వరకు అలా కొనసాగునో అనేది పెద్ద ప్రశ్న. ఈ తరము లేక రాబోవు తరములు క్రీస్తునందు విశ్వాసముంచినందున శ్రమలు అనుభవించుటకు పిలువబడుదురేమో. సిద్ధపాటు లేకుండ ఉండుట అవివేకము, మరియు రాబోవు తరమును సిద్ధపరచకుండ కూడ వదిలిపెట్టుట అవివేకము.

నిజముగా, క్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు కార్యమునకు సంబంధించిన ఈ సత్యములు, విశ్వసించుటకు, ధృవీకరించుటకు, కొనసాగించుటకు మరియు శ్రమలను అనుభవించుటకు యోగ్యమైనవి. క్రీస్తులో జీవము కలదు.

క్రీస్తు భూలోకములో ఉన్న ఒక సమయములో జనులందరూ ఆయనను వదిలివేసినప్పుడు, ఆయన తన శిష్య బృందముతో మిగిలిపోయెను. వారు కూడ వదిలి వెళ్లుదురా అని ఆయన వారిని ప్రశ్నించెను. వారి బృందము తరపున పేతురు ఇలాగన్నాడు: “ప్రభువా, యెవని యొద్దకు వెళ్ళుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు; నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నాము” (యోహాను 6:68-69). కొంత సమయము తరువాత పన్నెండుమందిలో ఒకనికి

సందేహములు కలిగినవి. యేసు సిలువ వేయబడి మరియు సమాధి చేయబడెను. ఆయన పునరుత్థానమునకు సాక్ష్యము కలదు, అయిననూ తోమా సందేహించెను. అప్పుడు యేసు తోమాకు ప్రత్యక్షమాయెను. తోమా క్రీస్తు యొక్క గాయములను తాకెను, ఆ గాయములను ఆయన మన పాపముల కొరకు భరించెను. తోమా "నా ప్రభువా, నా దేవా" అని ఒప్పుకొనెను (యోహాను 20:28).

కావున మేము నమ్ముచున్నాము. కావున మేము ఒప్పుకొనుచున్నాము.